

లంబోదరా నమో..నమః

నేడు వినాయక చవితి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 6: జై గణేశ.. శరణు విఘ్నేశ.. అంటూ ఆ స్వామి పూజకు సమయం ఆసన్నమైంది. గణనాథుడిని మనసారా కొలిచే వినాయక చవితి వేడుకను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఊరూవాడా ముస్తాబైంది. స్వామివారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు మండపాలు ఏర్పాటయ్యాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3వేలకు పైగా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. మూడో రోజు నుంచే నిమజ్జనోత్సవాలు ప్రారంభమవుతాయి. కాగా నంద్యాలలో మాత్రం ఐదో రోజు బుధవారం నంద్యాల చిన్న చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించనున్నారు.

● మట్టి విగ్రహాలకు డిమాండ్

వినాయక చవితి రోజున గృహాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేయడం ఒక సంప్రదాయం. ఈతరుణంలో భక్తులు తమ గృహాల్లో పూజించే గణపతి మూర్తులకు కూడా డిమాండ్ పెరిగింది. గతంతో పోలిస్తే మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత పెరిగింది. విద్యాధికులైన వారంతా పర్యావరణంపై అవగాహనతో మట్టి విగ్రహాలపై ఆసక్తి చూపిస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలనే కొనుగోలుకు ఇష్టపడుతున్నారు. నంద్యాలలో కల్పనసెంటర్, గాంధీచౌక్, టెక్కె మార్కెట్‌యార్డు, నూనెపల్లె తదితర ప్రాంతాల్లో వ్యాపారులు చిన్న చిన్న మట్టి విగ్రహాలను అమ్మకాలకు పెట్టారు. వీటితో పాటు గరిక, అరటి, మామిడి ఆకులు, చెరుకుగడలు తదితర పండ్లు, పుష్పాలు, పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్లు రద్దీగా కనిపించాయి.









వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత



నంద్యాల పట్టణంలో రుద్రాక్షల పంచముఖ వినాయకుడు





63 అడుగుల ఎకో ఫ్రెండ్లీ గణపతి

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటి చెబుతూ కర్నూలుకు చెందిన యువత ఏకంగా 63 అడుగుల ఎత్తులో ఎకో ఫ్రెండ్లీ గణపతి మూర్తిని రూపొందించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఈ భారీ మట్టి వినాయకుడు భక్తులతో 11 రోజుల పాటు పూజలు అందుకోనున్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున ఈ ఉత్సవ గణపతిని నెలకొల్పారు. బంకమట్టి, వెదురు బద్దలు, జనపనార, కొబ్బరిపీచు, గడ్డి, నీటిలో సులువుగా కరిగిపోయే సంప్రదాయ రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఇతర గణపతి మూర్తుల్లా కాకుండా, గణేశ్ నవరాత్రి ఉత్సవాల అనంతరం ఈ మట్టి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించకుండా, ఉన్నచోటే నిమజ్జనం చేస్తున్నారు. ఫైర్ ఇంజన్ల ద్వారా నీటిని విగ్రహంపై పిచికారీ చేస్తూ, కరిగిన మట్టి తుంగభద్ర నదిలో కలిసి పోయేలా ఏర్పాట్లు చేశారు. నగరంలోని లక్ష్మి నరసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఈ భారీ గణపతి మూర్తిని తయారు చేసేందుకు ప్రత్యేకంగా కోల్‌కతాకు చెందిన 15 మంది కళాకారులు గత నెల రోజులుగా శ్రమించి ఈ విగ్రహాన్ని తయారు చేశారు. పీఓపీ, రసాయనాలతో కూడిన విగ్రహాల వల్ల జల కాలుష్యమై, నీటిలోని జీవరాశి నశించిపోతుందని, పర్యావరణహిత గణపతులను పూజించాలనే నినాదంతో ఈ విగ్రహాన్ని నెలకొల్పినట్లు నిర్వాహకుడు కల్యాణ్‌కుమార్ తెలిపారు.



ఓర్వకల్లులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య →

ప్రజాభీష్టం మేరకే పరిశ్రమలు

జాయింట్ కలెక్టర్ బి.నవ్య

ఓర్వకల్లు, సెప్టెంబరు 6: ప్రజలు, రైతుల అభీష్టం మేరకే పరిశ్రమల ఏర్పాటు ఉంటుందని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు గ్రామంలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్ క్వాటరైజిక్ట్ కంపెనీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ప్రజా సంఘాలు, ఎన్జీవోలు గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ ఓర్వకల్లు గ్రామంలో సర్వేనెం. 533పి, 535/2ఏ1లో 8.486 హెక్టార్ల విస్తీర్ణంలో గనిని ప్రతిపాదిస్తున్నారని.. ఈ క్వాటరైజెక్ట్ మెటామార్ఫిక్ రాయి దీనిని ప్రధానంగా గాజు పరిశ్రమలు, ఇతర నిర్మాణాలకు ముడి పదార్థాలను ఉపయోగిస్తారన్నారు. సంవత్సరానికి 76.725 టన్నులు ఉత్పత్తికి అంగీకారం కుదిరిందని అన్నారు. అదే విధంగా 545పీ, 546, 587 సర్వే నెంబర్లలో 18.164 హెక్టార్లు సంవత్సరానికి 119.925 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటుందని అన్నారు. 533పీ సర్వే. నెంబరులోని 15.411 హెక్టార్ల విస్తీర్ణంలో 89.887 సంవత్సరానికి టన్నుల ఉత్పత్తి విస్తీర్ణంలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ మైనింగ్‌ల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పర్యావరణ అనుమతుల కోసం ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, ఆర్డీవో శేషిరెడ్డి, పొల్యూషన్ ఈఈ ముని ప్రసాద్, తహసీల్దార్ వెంకటరమణ, జడ్పీటీసీ రంగనాథగౌడు, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

● ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



ఇప్పటికే ఎన్డీయే ప్రభుత్వం కారిడార్‌గా ఓర్వకల్లును ప్రకటించింది. నిధులు కూడా కేటాయించింది. అయితే..పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. గ్రామాభివృద్ధికి పరిశ్రమల తోడ్పాటు అందిస్తే గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుంది రైతులకు, పశువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిశ్రమలు స్థాపించాలి.

\- గోవిందరెడ్డి, ఓర్వకల్లు

● పరిశ్రమలను స్వాగతిస్తున్నాం



ఓర్వకల్లు ప్రాంతానికి పరిశ్రమలు రావడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే.. ఇప్పటికే మండలంలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిశ్రమలు స్థాపించాలి. పరిశ్రమల స్థాపన కోసం ఓర్వకల్లు గ్రామ ప్రజలు స్వాగతిస్తున్నారు.

\- రంగనాథగౌడు, జడ్పీటీసీ సభ్యుడు

అగ్గిపెట్టె మీద 60 సూక్ష్మ వినాయకులు



నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 6: నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని అగ్గిపెట్టెపై 60 సూక్ష్మ వినాయకుల చిత్రాలు గీసి అందరినీ అబ్బురపరిచారు. మైక్రోబ్రస్‌తో 2 గంటల వ్యవధిలో 60 సూక్ష్మ గణపతులను వివిధ రూపాలతో వాటర్ కలర్స్‌తో వేశారు. గణేశుడు భక్తులకు అభయమిస్తున్నట్లు త్రిముఖ గణపతి, నాట్యగణపతి, శంఖులో గణపతి, ఓం ఆకారంలో గణేశుడు, కాణిపాకం గణపతి, ఇలా అనేక భంగిమల్లో స్వామి చిత్రాలను చిత్రకారుడు కోటేష్ వేశారు.

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కలెక్టర్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 6: మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకునికి పూజలు చేయడం వల్ల విఘ్నాలు తొలగిపోతాయ, వినాయక చవితి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. అలాగే జేసీ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా గణేష్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సిబ్బంది నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 6 : జిల్లాలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, వివిధ విభాగాల్లో పనిచేసే పోలీస్ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ట్రాన్స్‌ఫర్లు, రిక్వెస్టులు, వైద్య సమస్యలు, సస్పెన్షన్ నుంచి విధులకు తదితర సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు స్పెషల్ బ్రాంచ్ సీఐ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆరు గేట్లు ఎత్తివేత

● జలాశయానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి

శ్రీశైలం, సెప్టెంబరు 6: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు జలాశయం ఆరు క్రస్టుగేట్లను తెరిచి దిగువ నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,43,802 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 1,64,432 వరద వస్తోంది. జలాశయం ఆరు క్రస్టుగేట్లు ఎత్తి 1,67,076 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,49,435 క్యూసెక్కుల వరద వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,515 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. డ్యాం ఆరు క్రస్టుగేట్ల ద్వారా 1,67,076 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



ఆరు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

93 పరిశ్రమలకు 8.43 కోట్ల సబ్సిడీ : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 6: జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పరిశ్రమల స్థాపనకు భారీ సబ్సిడీ ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 93 పరిశ్రమల యూనిట్లకు 8.43 కోట్ల రూపాయల సబ్సిడీ మొత్తాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా కింద నిర్దేశించిన 66 యూనిట్ల నెలకొల్పడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికిగాను బ్యాంకులకు పంపిన 119 దరఖాస్తులలో 21 యూనిట్లు మంజూరు చేసినట్లు ఎల్‌డీఎం రవీంద్రకుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపన కోసం స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించేలా బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్ర నాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది పీఈటీలే

● మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 6: విద్యాసంస్థల్లో విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది వ్యాయామ ఉపాధ్యాయులేనని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉత్తమ పీఈటీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో క్రీడా మౌలిక సదుపాయాలతోపాటు పరికరాలు అందిస్తే విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పీఈటీలు మలచగలుగుతారని ఆయన పేర్కొన్నారు. అలాంటి క్రీడాకారులను తయారు చేసే పీఈటీలకు ఉత్తమ పీఈటీల అవార్డులు ఇవ్వడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ పీఈటీ గ్రహీతలైన ఎంఎండీ బాషా, సుబ్రహ్మణ్యం, కొండెపోగు చిన్న సుంకన్న, ఓబన్న, రాఘవేంద్ర, సాలమ్మ, సరళ, కళ్యాణి, కవితలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేసన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, విశిష్ట అతిథి స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, సి.హర్షవర్ధన్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, గుడిపల్లి సురేందర్, నాగరత్నమయ్య, వంశీ, ప్రభాకర్, మాజీ ఎస్ఎఫ్ఐ సెక్రటరీ లక్ష్మయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

లోకాయుక్త తరలింపును వ్యతిరేకించాలి

● హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుకు బార్ అసోసియేషన్ నిర్ణయం



అత్యవసర సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాది

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 6: కర్నూలులో ఉన్న రాష్ట్ర లోకాయుక్త, ఉప లోకాయుక్త, మానవ హక్కుల సంస్థ, రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్‌లను అమరావతికి తరలించే నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కర్నూలు బార్ అసోసియేషన్ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సంస్థలను కర్నూలు నుంచి అమరావతికి తరలించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలంటూ కొందరు వ్యక్తులు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై చర్చించేందుకు శుక్రవారం కర్నూలు బార్ అసోసియేషన్ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాష్ట్ర హైకోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికే కర్నూలులో ఉన్న సంస్థలను ఎటువంటి పరిస్థితుల్లో తరలించరాదని డిమాండ్ చేశారు. హైకోర్టులో ఉన్న ఈ రిట్ పిటిషన్‌లో ప్రతి బార్ అసోసియేషన్ ఇంప్లీడ్ పిటిషన్లను దాఖలు చేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎ.రామసుబ్బారెడ్డి, సి.నాగేంద్రనాథ్, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, కె.కపిలేశ్వరయ్య, పి.నరసింహులు, మురళీ మనోహర్, ఎస్.చాంద్‌బాషా పాల్గొన్నారు.

వెల్దుర్తిలో దొంగతనం

మరో మూడు దుకాణాల్లో చోరీకి విఫల యత్నం

వెల్దుర్తి, సెప్టెంబరు, 6: వెల్దుర్తిలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సాయిరాం సీడ్స్ దుకాణం షెట్టరు తాళాలు పగులగొట్టి రూ.5 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అలాగే పట్టణంలో శ్రీలక్ష్మీనరసింహ ట్రేడర్స్ ఫర్టిలైజర్, పక్కనే ఉన్న ప్రకాష్ పశువుల దాణా, డోన్ రైల్వేగేటు సమీపంలోని దుకాణాల తాళాలను పగులగొట్టారు. ఈ మూడు దుకాణాలలో నగదు, వస్తువులు చోరీ జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పత్తికొండ, సెప్టెంబర్ 6 : పత్తికొండ సమీపంలో జగనన్న కాలనీ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పత్తికొండ మండలపరిధిలోని జెఎం తాండకు చెందిన అంజినాయక్ ద్విచక్రవాహనపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వాహనాలపై వెళ్తున్న కొందరు ఆయనను చికిత్సకోసం ఆటోలో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీలపై ఉత్కంఠ

పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్న ఉద్యోగులు



ఆదోని తహసీల్దార్ కార్యాలయం

ఆదోని, సెప్టెంబరు 6: రెవెన్యూ శాఖలో ఉద్యో గుల బదిలీ మార్గదర్శకాలపై ఉత్కంఠ నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖలో బదిలీలు చాలా వరకు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలమైన రెవెన్యూ అధికారులను నియమించుకొని అడ్డగోలుగా భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం అలాంటి వాటికి తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారిని సైతం పట్టణ ప్రాంతాల్లో నియమించుకునేలా చూడాలని ఉద్యోగ వర్గాలు సైతం కోరుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం చాలా మంది రెవెన్యూ అధికారులు బదిలీల నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. తాజాగా వీరికి స్థాన చలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలా మందికి అన్యాయం జరుగుతుందని ఉద్యోగులు చెబుతు న్నారు. ఉద్యోగ సంఘాల్లో వారి బాధ్యత ఏమిటీ.. ఆ పదవి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడానికేనా.. లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడుతుం దా..? అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టత ఇవ్వాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

● బదిలీల నుంచి తప్పించుకోవడానికే..

గతంలో రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగినప్పుడు రూ.లక్షల్లో చేతులు మారాయి. కొంత మంది తెలివిగా కొంత మొత్తాన్ని ఉద్యోగ సంఘానికి ఫండ్‌గా ఇస్తే ఏదో ఒక పదవి దక్కుతుందని భావించి ఆయా సంఘాలు, అసోసియేషన్లు, ప్రభుత్వ అధికారుల సంఘాల్లో చేరిపోయారు. తాలూకా, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు ఇలా పలు బాధ్యతల్లో ఉన్నారు. ఈ పదవులు చూసి వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వరాదని కొందరు రెవెన్యూ శాఖ అధికారులు కోరుతున్నారు.

● ప్రజా ప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలవుతోంది. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో పట్టు బిగించుకునేందుకు కావలసిన అధికారులను నియమించుకునేందుకు కసరత్తు ప్రారంభించిన ట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు రెవెన్యూ శాఖలోని అధికారులు ఆ సీటు కోసం పైరవీలు ప్రారంభించారు. అందుకు కావలసిన వారిని వెంట తీసుకెళ్లి ముడుపులు ముట్టజెప్పేందుకు కూడా వెనకాడడం లేదు.

● ఫెవికాల్ అధికారులపై ప్రత్యేక నిఘా

రెవెన్యూ శాఖలో ఎన్నో ఏళ్లగా ఒకే కార్యాలయం లోనే ఉంటూ బదిలీల్లో పక్క మండలానికి వెళ్లడం.. ఆరు నెలలపాటు పని చేసి మళ్లీ అదే మండలానికి వచ్చి విధులు నిర్వహిస్తున్న ఫెవికాల్ అధికారులపై ప్రత్యేక నిఘా ఉంచారు. కూటమి నాయకులు అలాంటి వారిని గుర్తించే పనిలో పడ్డారు. అలాంటి వారందరీ సొంత జిల్లా నుంచి మరో జిల్లాకు తరలించాలన్న ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకోవాలి

● ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 6: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకో వాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా సంతోషంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు, అపశృతులకు తావు లేకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా జరుపుకోవాలని సూచించారు.

నిబంధనలు ఇలా:

జిల్లాలో ఉన్న వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పోలీసు సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వినాయక విగ్రహాల మండపాలకు వాహనాలు దూరంగా నిలిపే విదంగ చూసుకోవాలి.
- విద్యుత్ సరఫరాకు, వాహనాల రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదు
- పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు ఇబ్బంది కలిగించేలా లౌడ్ స్పీకర్లు పెట్టరాదు
- రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు, మైకులు ఆపి వేసే విధంగా మండపాల నిర్వాహకులు చూసుకోవాలి.
- 24 గంటలు విగ్రహాల వద్ద కాపలా, పర్యవేక్షించుకునే బాధ్యత మండపం నిర్వాహకులదే.
- ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసు అధికారులకు లేదా డయల్ 100 పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

మతసామరస్యానికి కర్నూలు జిల్లా ప్రతీక

కులమత విభేదాలు లేకుండా ప్రజలందరూ సోదర భావంతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు నిర్వాహకులు, మేధావులు, మత పెద్దలు రాజకీయ పార్టీలు, యువత మీడియా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

'ఘన వ్యర్థాల తయారీ కేంద్రాలను పూర్తి చేయాలి'

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: జిల్లాలో ఘనవ్యర్థాల తయారీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల ని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జడ్పీలో ఆయ న చాంబర్‌లో రీసోర్స్ పర్సన్లతో సమీక్ష నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి 90 గ్రామాలను మోడల్ గ్రామాలకు తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ గ్రామా లుగా ఎన్నిక కావాలంటే ప్రధానంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించి ఉండాలన్నారు. అంతే కాకుండా ఘనవ్యర్థాల తయారీ కేంద్రాలు అందుబాటులోకి తీసుకు వస్తేనే మోడల్ గ్రామాలుగా గుర్తిస్తారని ఆయన తెలిపారు. ప్రధానం గా ఎక్కడైన స్థల సమస్యలు ఉంటే సంబంధిత ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు జేమ్స్ కృపవరం, మహేశ్వరి, అఫ్రస్‌బాషా, జగన్నాథం, సునీత, పద్మావతి పాల్గొన్నారు.



రిసోర్స్ పర్సన్లతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

రూ.42.54 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు సంబంధించి 613 సీసీ రోడ్లకు రూ.42.54 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆదోని నియోజకవర్గంలో 78 రోడ్లకు రూ.5 కోట్లు, ఆలూరు నియోజకవర్గంలో 204 రోడ్లకు రూ.12.75 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 153 రోడ్లకు రూ.14.63 కోట్లు, పత్తికొండ నియోజకవర్గంలో 178 రోడ్లకు రూ.10.10 కోట్లు కలిపి మొత్తం రూ.4254 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నూతన రోడ్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు అందడంతో అధికారులు పంపించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం, బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కౌతాళం, సెప్టెంబరు 6: మండల పరిధిలోని మేళిగనూరు, నదిచాగి గ్రామాల మధ్య బండిరస్తా వద్ద శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంటకుంట గ్రామానికి చెందిన కుమార్, రాఘవేంద్ర మల్లయ్యతో పాటు ఉరుకుంద గ్రామానికి చెందిన ఈడిగ మల్లయ్య, కాత్రికి గ్రామానికి చెందిన మహేంద్ర నాలుగు ద్విచక్ర వాహనాలపై కర్ణాటకలోని మురణి గ్రామం నుంచి 30 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి 30 బాక్సుల మద్యంతోపాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మద్యం రవాణ కేసులో ఒకరి అరెస్టు



సీజ్ చేసిన మద్యం

మంత్రాలయం, సెప్టెంబరు 6: మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి మోటారు సైకిల్‌పై మద్యం తెస్తుండగా.. ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, మాధవరం చెక్‌పోస్టు ఎస్ఐ వీరస్వామి దాడులు చేసి పట్టుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గరీబ్ మహ్మద్ ఆల్తాఫ్, కర్ణాటకలోని రాయచూరు చెందిన వినోద్, ఎమ్మిగనూరు చెందిన వినోద్, మమత అనే వ్యక్తులు మద్యం తెస్తుండగా పట్టుకున్నారు. రెండు చోట్ల వేర్వేరు సమయాల్లో ముగ్గురుని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న బైక్‌ను సీజ్ చేసి ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వద్దనున్న 672 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నందికొట్కూరులో మహిళ హత్య

● తొమ్మిదేళ్ల నాటి తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్న యువకుడు



శాలుబీ (ఫైల్)

నందికొట్కూరు, సెప్టెంబరు 6: నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ మహిళ గురువారం రాత్రి దారుణహత్యకు గురైంది. పది సంవత్సరాల క్రితం తన తండ్రి హత్యని హత్య చేసిన ఘటనలో లక్ష్మీ నరసింహ అనే యువకుడు శాలుబీ(41) అనే మహిళను గొడ్డలితో నరికి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన శాలుబీ దొంగతనాలతోపాటు నేర ప్రవృత్తితో జీవనం సాగించేది. శాలుబీ మొదటి నుంచి నేర ప్రవృత్తి కలిగి ఉండడంతోపాటు, మర్డర్ కేసుల్లో ముద్దాయి, రౌడీషీటర్‌గా ఆమె ఉన్నారు. పట్టణానికి చెందిన వడ్డె గజేంద్ర అనే వ్యక్తి 2015లో హత్యకు గురయ్యాడు. ఆయన హత్య కేసులో శాలుబీ ఏ1 నిందితురాలిగా ఉంది. ఈ క్రమంలో గజేంద్ర కుమారుడు లక్ష్మి నరసింహను కొంతమంది స్నేహితులు రెచ్చగొట్టారు. 'మీ నాన్నను చంపిన వ్యక్తిని ఏమి చేయలేకపోతున్నావు..' అంటూ హేళన హేళనగా మాట్లాడేవారు. దీంతో తండ్రి హత్యకు కారణమైన శాలుబీని మిత్రులతో కలిసి హత్య చేయాలని భావించాడు. గురువారం రాత్రి శాలుబీ ఇంట్లో ఉండగా ఇంటి తలుపులను ధ్వంసం చేసి శాలుబీని గొడ్డలితో నరికి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. మృతురాలి కుమారుడు మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వినాయక చవితి సందడి

● మండపాలకు చేరుకున్న ప్రతిమలు ● పూజా సామగ్రి కొనుగోలు చేసిన ప్రజలు



శ్రీశైలంలో మట్టి విగ్రహాన్ని పంపిణీ చేస్తున్న అధికారులు



నందికొట్కూరు: పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న పట్టణ ప్రజలు

నందికొట్కూరు, సెప్టెంబరు 6: చవితి ఉత్సవాలకు పందిళ్లు సిద్ధమయ్యాయి. ఎక్కడికక్కడ ఉత్సవ కమిటీలు నవరాత్రుల పూజాధికాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణలు చేశారు. సర్వ విఘ్నాలను తొలగించే ఆదిదేవుడు గణపతి పూజకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. పూజాదికాల నిమిత్తం వస్తు సామగ్రి కొనుగోలుకు నందికొట్కూరు పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేరుకున్నారు. దీంతో పట్టణంలోని పాతబస్టాండు, పటేల్ సెంటర్ కొత్తబస్టాండ్ తదితర ప్రాంతాల్లో పండ్లు, గణపతి విగ్రహాలు, పత్రులు, పువ్వులు, దుకాణాలు ప్రజలతో నిండాయి. పట్టణంలోని కేంద్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పందిళ్లు వీధివీధిలో వెలిశాయి. ప్రజలు వినాయ చవితికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తుండడంతో రద్దీగా మారింది. పట్టణంలోని ఆవుల సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆత్మకూరు: వినాయక చవితిని పురస్కరించుకుని ఆత్మకూరు ప్రాంతంలో ఒక్కరోజు ముందుగానే చవితి సంబరాలు ఊపందుకున్నాయి. శనివారం జరిగే వినాయకుడి పండుగను సంతోషంగా జరుపుకొనేందుకు ఆయా మంటపాల నిర్వాహకులతో పాటు భక్తులు శుక్రవారం ఉత్సాహంగా ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో సుమారు 35దాకా గణనాధులు కొలువుతీరనున్నారు. అదేవిధంగా చుట్టు పక్కల గ్రామాల్లో కూడా విగ్రహాల సంఖ్య అంచనాలకు మించి పెరిగాయి. అలాగే ఉత్సవాన్ని సంబరంగా జరుపుకొనేందుకు మంట పాల నిర్వాహకులు పోటీపడుతున్నారు. ఆయా మంటపాల వద్ద కాషాయపు జెండాలతో, విద్యుత్ అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. కాగా వినాయక ఉత్సవాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా వినాయకుడి పూజలో ఉపయోగించి గరిక గడ్డి, ఎలక్కాయలు, మొక్కజొన్న కంకులు, పుష్పాల తదితర పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు గౌడ్‌సెంటర్‌లో ప్రజలు పోటెత్తారు. ఈ నెల 9న జరిగే నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

నంద్యాల క్రైం/కల్చరల్: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. బాల అకాడమీ, రవీంద్ర విద్యాసంస్థల అధినేత రవీంద్ర ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా, వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, 6వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పల్లె వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. నంద్యాల లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్ సౌజన్యంతో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు లయన్స్ క్లబ్ సభ్యులు, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు. స్మార్ట్ సిటీ నంద్యాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. గంగిశెట్టి దీపక్ సహకారంతో కార్యక్రమం చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తులసిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గంగిశెట్టి విజయ్, గణేష్ ఉత్సవ కమిటి అధ్యక్షుడు డా.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని గౌడ్‌సెంటర్‌లో..

మహానంది: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడదామని టీడీపీ శ్రీశైల నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం మహానందిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ హైమావతి సహకారంతో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, గంగిశెట్టి మల్లికార్జున, వెంకటేశ్వర్లు, ఉమాదేవి, గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి వినాయక విగ్రహాలనే పూజించడం శుభప్రదమని ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గౌడ్‌సెంటర్‌లోని ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి నాయకులు శేగు కిరణ్‌కుమార్ సహకారంతో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం వినాయకస్వామి మట్టివిగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసింది. డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, స్వామివార్ల ప్రధానార్చకులు వీరయ్యస్వామి, ఆలయ ఏఈవో హరిదాసు, పీఆర్‌వో శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న, గిరిజామణి పాల్గొన్నారు. అలాగే శ్రీశైలం హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచితంగా 500 మట్టి వినాయక విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు.

శ్రీశైల మల్లనకు బంగారు పుష్పాలు



అధికారులకు బంగారు పూలను అందజేస్తున్న భక్తులు

శ్రీశైలం, సెప్టెంబరు 6: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానానికి శుక్రవారం కర్నూలుకు చెందిన బీసీ శివకుమార్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి 108 బంగారు పూలను బహూకరించారు. స్వామి, అమ్మవార్ల కైంకర్యాలలో ఈ బంగారు పూలను వినియోగించాలని దాత కోరారు. 108 బంగారు పూల బరువు 19 గ్రాములు ఉంటుందని దాత తెలిపారు. దాత వీటిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలోసీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణ, పర్యవేక్షకుడు కె. అయ్యన్న, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జునకు అందజేశారు. అనంతరం దాతకు వేదాశీర్వచనం, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

వరద బాధితులకు దుప్పట్లు



దుప్పట్లను విజయవాడకు తరలిస్తున్న దృశ్యం

నంద్యాల క్రైం, సెప్టెంబరు 6: నంద్యాలలో కేబుల్ ఆపరేటర్లు విజయవాడ వరద బాధితులకు చేయూతగా నిలిచారు. నంద్యాల కమ్యూనికేషన్ సిటీ కేబుల్, ఎంఆర్ కేబుల్ ఆపరేటర్లు వరద బాధితుల కోసం 400దుప్పట్లను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆధ్వర్యంలో విజయవాడకు పంపించారు. కేబుల్ ఆపరేటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులకు తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్న హుసేని, టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి గోవిందనాయుడు, రాజేష్, నాయకులు, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన కేశవరెడ్డి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 6: నంద్యాల పట్టణానికి చెందిన కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత నాగిరెడ్డి కేశవరెడ్డి గురువారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి బొకే అందజేశారు. పార్టీ బలోపేతంపై చర్చించినట్లు ఆయన తెలిపారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కేశవరెడ్డి

ముగిసిన ఎల్ఐసీ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 6: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ 68 వార్షికోత్సవం శుక్రవారంతో ముగిసినట్లు బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏబీఎం విశ్వనాథ్ తెలిపారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ సురేష్ కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎల్ఐసీ సంస్థ పాలసీ దారులకు విశిష్ట సేవలు అందిస్తూనే సమాజ సేవలో కూడా ముందుంటుందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీఐ చేతుల మీదుగా బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఏజంట్లు, ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఏవోలు ఉమాశంకర్, సంకీర్తన, ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మనోజ్‌కుమార్, జయ్‌కుమార్, లియాఫి నాయకులు అబ్దుల్‌కరీం, స్వామిదాసు, సాయిరాం, రాంబాబు, డీవో జగన్నాథరాజు, ఉద్యోగులు నాగన్న, అమీర్, ఇస్మాయిల్, ప్రవీణ్, ఆత్మకూరు నందికొట్కూరు ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'డ్రోన్‌తో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ'

నంద్యాల టౌన్, సెప్టెంబరు 6: డ్రోన్ వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉంటుందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం జాన్సన్ అన్నారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ, సందర్శన (టీ అండ్ వీ) సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు, పంటల స్థితిగతులు, వర్షపాతం వివరాలు, తదితర అంశాలపై విశదీకరించారు. నంద్యాల జిల్లాలో ఆగస్టు నెలాఖరుకు 322 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 450.40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని అన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో కొత్తపల్లె, పాములపాడు మండలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి, మినుము పంటలు ముంపుకు గురయ్యాయని ఆయన తెలిపారు. ముంపునకు గురైన పంటల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన విధంగా యాజమాన్య పద్ధతులను రైతులు అనుసరించాలని అన్నారు. వర్షాల ప్రభావంతో పంటలపై తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందన్నారు.

'కోల్పోయిన పోషకాలను తిరిగి అందించాలి'

భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న, మిరప, పత్తి పంటల్లో 30 కేజీల యూరియా, పది కేజీల పొటాష్ ఎరువులను పైపాటుగా అందించినట్లైతే మొక్క కోల్పోయిన పోషకాలను తిరిగి అందించవచ్చని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ, కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 ఎరువును 200 గ్రాములను ఎకరాకు పిచికారీ చేయాలని, దీంతో పాటు ఫార్ములా -4 సూక్ష్మపోషకాల ఎరువును 2.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో పూత రాలిపోతే కొత్త పూత కోసం ప్లానో ఫిక్స్ 2.5 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల వచ్చే బూడిద తెగుళ్లు, కాయకుళ్లు, వివిధ రకాల తెగుళ్ళకు కాపర్ ఆక్సీక్లోరైడ్/ రెడోనిల్ 3 గ్రాములు లీటర్ నీటికి లేదా 600 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. కర్నూలు జిల్లాకు పెద్దగా వర్ష ప్రభావం లేదని డీఏవో వరలక్ష్మి పేర్కొన్నారు. రబీలో సాగు చేసేందుకు వీలుగా శనగలో కొత్త రకాలైన ఎన్‌బీఈజీ -776, ఎన్‌బీఈజీ -452, ఎన్‌బీఈజీ -857 రకాలు ఆర్ఏఆర్ఎస్‌లో విత్తనాలను అందుబాటులో ఉన్నాయని, రైతులు సంప్రదించాలని ఏడీఆర్ తెలిపారు. టీ అండ్ వీ సమావేశం అనంతరం డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరద బాధితులకు చేయూత



విరాళాన్ని ఎమ్మెల్యే బుడ్డాకు అందజేస్తున్న దాతలు

వెలుగోడు, సెప్టెంబరు 6: విజయవాడలో వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి విరాళం అందించారు. శుక్రవారం ఆత్మకూరు వెంగయ్య స్వీట్సు యజమానులు ఎమ్మెల్యే స్వగ్రామం వేల్పనూరులో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి తమ వంతు సహాయంగా రూ. 25,101 వేల చెక్కును అందించారు. దీంతో ఎమ్మెల్యే వారిని అభినందించారు.

కేజీబీవీ తనిఖీ

మిడుతూరు, సెప్టెంబరు 6: మిడుతూరులోని కేజీబీవీని ఎంఈవో ఫయిజున్‌బీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థినులను పాఠ్య అంశాలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు.

'గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

మహానంది, సెప్టెంబరు 6: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మహానంది పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం మండల గణేశ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిం చారు. ఎస్ఐ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం సందర్భంగా జరిగే కార్యక్రమాలలో డీజేలకు అనుమతి లేదన్నారు. మండప నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. గణేశ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోస్పాడు: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

కొత్తపల్లి: ఈ నెల 7వ తేదీ నుంచి జరుపుకునే వినాయక చవితి పర్వదినాన్ని మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కేశవ అధ్యక్షతన తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను మత పెద్దలు, గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

కోనేరులో గుర్తు తెలియని మృతదేహం

పగిడ్యాల, సెప్టెంబరు 6: మండలంలోని తూర్పు పాతకోట గ్రామంలోని నాగేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని కోనేరులో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కేసీ కాలువలో నీరు తగ్గిపోవడంతో 93వ స్లూయిజ్ నుంచి కోనేటిలోకి శవం కొట్టుకు వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. బ్లూకలర్ పాయింట్ టీషర్టు ధరించి 30 సంవత్సరాల వయసు కలిగిన యువకుడి మృతదేహంగా గుర్తించారు. కోనేటి నుంచి దుర్వాసన వస్తుండంతో గమనించిన వారు వీఆర్వో హరినాథ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'

కొత్తపల్లి, సెప్టెంబరు 6: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా ముఖ్యమని వైద్యాధికారి ప్రతాప్ సూచించారు. శుక్రవారం మండలంలోని జానాల గూడెంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి పలువురు రోగులను పరిశీలించి ఉచిత మందులు పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ మాట్లాడుతూ మద్యం, గుట్కా అలవాట్లకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. ఆర్డీటీ కౌన్సిలర్లు మోతిలాల్, జానకి, సీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'పంట నష్టం జాబితా రూపొందించాలి'

బండిఆత్మకూరు, సెప్టెంబరు 6: మండలంలో ఎక్కడైనా పంట నష్టం జరిగి ఉంటే జాబితా రూపొందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహెమాన్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆల్ఫ్రెడ్, ఏవో స్వాతిల ఆధ్వర్యంలో పంటల నష్ట సేకరణ సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, ఏవో లింగాపురం గ్రామంలో నీట మునిగి బయటపడిన పొలాలను పరిశీలించారు.

మొక్కల పరిశీలన

బండిఆత్మకూరు, సెప్టెంబరు 6: మండలంలోని కృష్ణనంది ఆలయ పరిసర ప్రాంతంలో శుక్రవారం వెంగళరెడ్డిపేట రైతులు బ్లాక్ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలను అంబుడ్స్‌మన్ పరిశీలించారు. మొక్కలు జాగ్రత్తగా పెంచాలని, తద్వారా వచ్చే ఫలాలతో రైతులు అభివృద్ధి చెందాలని సూచించారు. ఏపీవో వసుధ, టీఏ, రైతు సోమశేఖర్‌రెడ్డి, ఎఫ్ఏ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మిడుతూరు, సెప్టెంబరు 6: మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు నాగలక్ష్మమ్మ, శివరంజని, అరుణకుమారి, విజయలక్ష్మమ్మ, సురేంద్ర మోహన్, రవిమనోహర్, షాదిక్‌ను మిడుతూరు ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి, ఎంఈవోలు ఫయిజున్‌బీ, శ్రీనాథ్, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సాయి తిమ్మయ్య, రిటైర్డ్ ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: విధుల్లో అంకితభావం ప్రదర్శించినప్పుడే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తోందని ఆత్మకూరు తాలుకా సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అంకన్న పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణను ఆయన సత్కరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

పగిడ్యాల, సెప్టెంబరు 6: పగిడ్యాల సమీపంలో దెబ్బ తిన్న మినుము పంటను శుక్రవారం రైతులతో కలిసి వ్యవసాయ అధికారి విజయ్ జ్యోతి కుమార్ పరిశీలించారు. దిగుబడులు చేతికి వచ్చే దశలో అధి వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఏవోకు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

నందికొట్కూరు, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో విరాళాలు సేకరించారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాయంత్ర విజయవాడ వరద బాధితులకు పట్టణంలో వాల్మీకి నగర్ నుంచి శాంతి టాకీస్, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, పోలీస్‌స్టేషన్ వరకు విరాళాల సేకరణ చేశారు. రైతు మహిళా నాయకురాలు ఎస్.బీబీ, మల్లేశ్వరమ్మ, నూర్జహాన్, మల్లమ్మ, సోమన్న రాజు, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, సెప్టెంబరు 6: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు. శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం నల్గొండకు చెందిన సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్యకళాశాల బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, ఓం నమఃశివాయ, శివలీలలు, ఈశ్వరా పరమేశ్వరా తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'చెంచుల అభివృద్ధే లక్ష్యం'



చెంచులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బండిఆత్మకూరు, సెప్టెంబరు 6: ప్రధానమంత్రి ఆదివాసీల న్యాయ మహా అభియాన్ చెంచుల అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమని ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ ఆల్ఫ్రెడ్, పీఆర్ ఏఈ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని సోమయాజులపల్లె మజరా నాయినిచెర్వు గూడెం చెంచులతో అధికారులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. చెంచులకు కనీసం విద్య, వైద్యం, గూడు, రోడ్లు, ఉపాధి, విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పన కోసం ఈ పథకం ఐటీడీఏ ద్వారా అమలు చేస్తోందని తెలిపారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీవో నాగార్జున పాల్గొన్నారు.

కూలిన మిద్దెల పరిశీలన

మిడుతూరు, సెప్టెంబరు 6: మండలంలోని దేవనూరు, సున్నంపల్లి, మిడుతూరు గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా కూలిన మట్టి మిద్దెలను తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. కూలిన మిద్దెల వల్ల నష్టపోయిన వారిని గుర్తించి నివేదిక తయారు చేసి ఉన్నత అధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహస సుప్రియ, ఆర్ఐ బాష, వీఆర్‌వోలు ఆంజనేయులు, సోఫిసాహెబ్ పాల్గొన్నారు.

రేపు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

ఆత్మకూరు, సెప్టెంబరు 6: పట్టణంలోని కొండా గార్డెన్‌లో ఆదివారం టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సారధ్యంలో జరిగే ఈ సమావేశానికి అన్ని మండలాల అధ్యక్షులు, కస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, ఆయా గ్రామాల నాయకులు, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దెబ్బతిన్న మొక్కజొన్న

● భారీ వర్షాలకు పొలాల్లో నిలిచిన వర్షం నీరు
● ఆందోళనలో రైతులు

కొత్తపల్లి, సెప్టెంబరు 6: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికొచ్చిన మొక్కజొన్న పంట నీటి పాలైంది. కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 9వేల హెక్టార్లకు పైగా మొక్కజొన్న పంటను రైతులు అప్పులు తెచ్చి మరీ సాగు చేశారు. మొక్కజొన్న పంట ఏపుగా పెరిగి కంకిదశలో ఉన్న సమయంలో ఏకధాటిగా ఐదు రోజులుగా భారీ వర్షాలు పడ్డాయి. దీంతో శివపురం గ్రామ శివారులోని ఎద్దులేరు వాగు, కొత్తపల్లి కనికలమ్మ చెరువు, గువ్వలకుంట్ల భైరప్ప చెరువు, బండినాయునిపాలెం చెరువులు ఉప్పొంగి ప్రవహించి పంట పొలాలను ఒక్కసారిగా ముంచెత్తాయి. ఐదు రోజులుగా మొక్కజొన్న, మినుము పంటలు నీటిలో ఉండటంతో కుళ్లిపోయాయి. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది మొక్కజొన్నను భారీగా సాగు చేశారు. మంచి దిగుబడి వచ్చి తమ కష్టాలు తీరుతాయన్న సమయంలో వర్షాలు నట్టేట ముంచాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.



సింగరాజుపల్లిలో నీట మునిగిన మొక్కజొన్న పంటను వ్యవసాయ సిబ్బందికి చూపుతున్న రైతులు

రైతులను ఆదుకోవాలి



ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు అప్పులు చేసి పంటను సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- బుచ్చిరెడ్డి, రైతు గుమ్మడాపురం

పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం



భారీ వర్షాలకు పంటలు నీట మునిగి బాగా దెబ్బతిన్నట్లు గుర్తించాం. ఇప్పటికే ఏడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించాం. రెండు రోజుల నుంచి ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు, రైతు భరోసా సిబ్బందితో పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. పూర్తి స్థాయి నివేదిక అందిన వెంటనే నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి పంపిస్తాం.

- మహేష్, మండల వ్యవసాయాధికారి

గ్రామ సమాచారం తెలియజేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6: గ్రామాల్లో జరిగే ఘటనల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు తెలపాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో, వీఆర్‌ఏలకు సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలతోతహసీల్దారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గత ఆరు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, దీంతో కోవెలకుంట్ల పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో మట్టి మిద్దెలు బాగా నాని కూలుతున్నాయని అన్నారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు అప్రమత్తంగా ఉంటూ తహసీల్దారుకు సమాచారం ఇవ్వాలన్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 6: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడ 45వ డివిజన్‌లోని వరద ప్రాంతాల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ శుక్రవారం పర్యటించారు. ఈమేరకు ఆమె అక్కడి ప్రజలకు భూమా శోభానాగిరెడ్డి ట్రస్టు తరఫున నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వరద ప్రాంతంలోని బాధితులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. వైసీపీ నాయకులు వరద ప్రాంతాల్లో పర్యటించకుండా శవ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వరద ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన, మరణించిన కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి ఉన్నారు.

బాధితులకు రూ.1.98 లక్షలు విరాళం

రుద్రవరం, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు రుద్రవరంలోని టీడీపీ నాయకులు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు రూ.1.98లక్షలు ఆర్థిక సాయాన్ని అందించినట్లు శుక్రవారం టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో టీడీపీ నాయకులు గ్రామ గ్రామాన ఆర్థిక సాయాన్ని సేకరించి ఎమ్మెల్యేకు అందించినట్లు వారు తెలిపారు. ఈ ఆర్థిక సాయం విజయవాడ వరద బాధితుల కోసం ఎమ్మెల్యే ద్వారా అందించడం తృప్తినిస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 6: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ అన్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నీటి నాణ్యతపై వారు పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని దేవరబండ, కొత్తపల్లి గ్రామాల్లో అధికారులు నీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తగా ఎదగాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 6: పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని నిర్వాహకులు హుసేన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హుసేన్ రెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిరాహకులు మాణిక్యంశెట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బేతంచెర్ల, సెప్టెంబరు 6: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గానిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో సరళ, సరస్వతి, ఆశాలు తిరుపాలమ్మ, సరోజ, అంగన్‌వాడీలు భూలక్ష్మి, సరోజమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: బుగ్గన



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

ప్యాపిలి, సెప్టెంబరు 6: నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని వెంగళాంపల్లి చెరువు, లక్ష్మీకంబగిరిస్వామి దేవాలయ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో రూ.కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. అయితే వాటిలో కొన్ని పూర్తి కాగా మరికొన్ని పనులు 90శాతం పూర్తి చేశామన్నారు. నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీరాములు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, భువనే శ్వరరెడ్డి, క్రిష్ణారెడ్డి, రజనిరెడ్డి, రాము, తిరుమలరెడ్డి, దివాకర్‌రెడ్డి, అనీల్, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తా: బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 6: బనగానపల్లె పట్టణంలో వ్యాపార రంగం దినదినాభివృద్ధి చెందడానికి తనవంతు కృషి చేస్తానని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రైవేటు వ్యాపార సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణం వ్యాపారానికి కేంద్రంగా ఉండడంతో పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.28500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె రోడ్డులో ఉన్న టీటీడీ కల్యాణ మండపం వద్ద కంపచెట్లలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని అన్నారు. తమ సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని, రూ.28,560 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చవితి సందడి

- పూజా సామగ్రి కొనుగోళ్లకు డిమాండ్
- ముస్తాబైన వినాయక మండపాలు

బేతంచెర్ల, సెప్టెంబరు 6: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండులో సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయకునికి సమర్పించే పూజా సామగ్రిని పాతబస్టాండులో కొనుగోలు చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. పట్టణంలో గణేశ్ ఉత్సవ మండలి కమిటీలు విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేసినట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

ఆళ్లగడ్డ: వినాయక చవితి నాడు గణనాథులను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు ట్రాక్టర్లలో శుక్రవారం తరలించారు. ఆళ్లగడ్డ పట్టణం, చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించేందుకు సుమారు 500 విగ్రహాలను తరలించారు. ఇదిఇలా ఉండగా గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రవికుమార్ నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణలో పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు.

చాగలమర్రి: మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీరేందుకు మండపాలను సిద్ధం చేశారు. ఆళ్లగడ్డ, మైదు కూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి చాగలమర్రికి తరలించారు. అయ్యప్ప ఆలయంలో విగ్రహాలను ఉంచారు. శనివారం ఆయా విగ్రహాలను వీధుల గుండా ఊరేగింపు చేసి మండపాలలో కొలువు దీరుస్తారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు తెలిపారు. విగ్రహాల వద్ద కమిటీ సభ్యులదే బాధ్యతని, ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు.



కొలిమిగుండ్లలో..

కొలిమిగుండ్ల: వినాయక చవితి ఉత్సవాలకు వివిధ ఆకృతులలో గణపయ్య ప్రతిమల ప్రతిష్ఠకు ఉత్సవ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. రంగురంగుల కాగితాలు, జిగేలుమనిపించే డేకరేషన్‌లతో మండపాలను చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం విగ్రహాలు కొనుగోలు చేసి ట్రాక్టరులో తీసుకువెళ్లారు. గ్రామంలో వినాయక విగ్రహాలు కొలువుదీ రనున్నాయి.

అవుకు: పట్టణంలో గణనాథుడి పూజా సామగ్రి కొనుగోలుకు గిరాకీ ఏర్పడింది. మామిడి ఆకులు, అరటి బెరళ్లు, చెరుకు గడలు, గరక పలు రకాల సామగ్రిని భక్తులు కొనుగోలు చేశారు.



చాగలమర్రిలో ముస్తాబైన వినాయక మండపం



బేతంచెర్లలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఆళ్లగడ్డలో గణనాథుడిని తీసుకెళ్తున్న నిర్వాహకులు

నిండుకుండలా తుండ్లవాగు రిజర్వాయర్



నీటితో కళకళలాడుతున్న తుండ్లవాగు రిజర్వాయరు

రుద్రవరం, సెప్టెంబరు 6: నల్లమలలో ఉన్న తుండ్లవాగు రిజర్వాయరు నిండుకుండలాల దర్శనమిస్తోంది. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ద్వారా విడుదల చేసిన నీరు, మరో వైపు నల్లమలలో భారీ వర్షంతో నీరు తుండ్లవాగు రిజర్వాయరుకు చేరింది. 0.30 టీఎంసీల నీరు రిజర్వాయరు సామర్థ్యం కలిగి ఉందని ఏఈ మోహనకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తుండ్లవాగు రిజర్వాయరును పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

చాగలమర్రిలో కుండపోత



గొడిగనూరులో జలమయమైన రహదారి

చాగలమర్రి, సెప్టెంబరు 6: చాగలమర్రి మండలంలో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూ ఉధృతి పెరిగింది. 16 వేల క్యూసెక్కులతో కుందూనది ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. కుందూ నీటి ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతుండటంతో ఆయా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎడతెరిపి లేని మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'నేత్ర దానం చేయాలి'



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 6: ఒకరి నేత్ర దానం ఇద్దరి జీవితాలకు వెలుగు ఇస్తుందని, నేత్రదానానికి ముందుకు రావాలని ఉయ్యాలవాడ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి అపర్ణ సూచించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ ఆవరణం వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కంటి వైద్యుడు రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 26 మంది స్వచ్ఛందంగా నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు ఇచ్చారన్నారు. ఎంపీహెచవో దస్తగిరి, సూపర్‌వైజర్ రామచంద్రుడు, పీహెచ్‌సీ లక్ష్మీదేవి, ఉపాధ్యాయుడు నాగార్జున పాల్గొన్నారు.

'సేవా దృక్పథం అలవర్చుకోవాలి'

శిరివెళ్ల, సెప్టెంబరు 6: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకులు ఖండే ఆనంద్ గురూజీ, శ్యాంసుందర్ లాల్ అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 1న శిరివెళ్లలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 45 మందికి అద్దాలు పంపిణీ చేసి 50 మందికి శుక్లం ఆపరేషన్ చేయిం చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో భాగంగా నంద్యాల ఉదాయ నంద వైద్యశాలలో డాక్టర్ పోగుల సౌమ్యచే ఇప్పటి వరకు 19 మందికి శుక్లం ఆపరేషన్లు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కిరణ్మయి, ధనుంజయ వర్మ, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

3,300 క్యూసెక్కులతో టీజీపీ నీటి ప్రవాహం

చాగలమర్రి, సెప్టెంబరు 6: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని టీజీపీ ప్రధాన కాలువలో 3,300 క్యూసెక్కులతో నీరు ప్రవహిస్తోందన్ని టీజీపీ ఈఈ శంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలో శుక్రవారం కడప జిల్లా సరిహద్దు వద్ద టీజీపీ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 30 నుంచి 37వ బ్లాక్ వరకు డిస్ట్రిబ్యూ టరీల ద్వారా పంట కాలువలకు నీరు విడుదల చేశామని, ఆయకట్టు రైతులు నీరు వృధా చేయకుండా వాడుకోవాలని సూచించారు. చాగలమర్రి మండలంలో 36,329 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. కడప జిల్లా బ్రహ్మసాగర్‌కు 7.06 టీఎంసీల నీటిని సరఫరా చేశామని అన్నారు. ఆయకట్టు రైతులు సాగునీటి కోసం టీజీపీ గేట్లను ఎత్తరాదని, అనుమతి లేకుండా ఎత్తితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఈఈ వెంకటరమణ, ఏఈ నిజాఅహ్మద్ ఉన్నారు.

వరి సాగుపై అవగాహన

చాగలమర్రి, సెప్టెంబరు 6: చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో వరి నాట్లు వేస్తున్న రైతులు, మహిళా కూలీలకు పొలంబడిపై ఏవో రంగనేతాజీ గురువారం అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసే పద్ధతి, సస్యరక్షణ, చీడ పీడల గురించి పొలంబడి కార్యక్రమం ద్వారా వివరించారు. వరి పంటకు తెగుళ్లు సోకిన వెంటనే సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. ఎండు, మత్స్య తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది సుబ్బరాయుడు, ఉమామహేశ్వరి ఉన్నారు.

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'

రుద్రవరం, సెప్టెంబరు 6: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అంతేకాక బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి తల్లులకు వివరించారు.

కూలిన కల్వర్టు



యర్రగుంట్లకు వెళ్లే రహదారిలో కూలిన కల్వర్టు

శిరివెళ్ల, సెప్టెంబరు 6: శిరివెళ్ల నుంచి వెంకటేశ్వరాపురం గ్రామం మీదుగా యర్రగుంట్లకు వెళ్లే రహదారిలో కల్వర్టు కూలిపోయింది. ఈ రహదారిలో రైతులకు చెందిన వేల ఎకరాల పొలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమవ్వడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలాంటి సమయంలో కల్వర్టు కూలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు దమ్ము చేసుకునేందుకు, ఎరువులు, కూలీలను తరలించుకునేందుకు ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలు లేకుండా పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వర్టును నిర్మించి రాకపోకలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి





బేతంచెర్లలో మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, బనగానపల్లెలో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

బేతంచెర్ల, సెప్టెంబరు 6: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని హిందూ, ముస్లిం మత పెద్దలకు, గణేశ్ ఉత్సవ కమిటీల సభ్యులకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ వెంకటేశ్వరరావు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో వెంకన్న, ప్రభుత్వ వైద్యాధికారిణి డా. సాగరిక, మతపెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బనగానపల్లె సీఐ కృష్ణయ్య కోరారు. శుక్రవారం బనగానపల్లె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి . హిందూ, ముస్లిం మతపెద్దలకు ఈ సూచన చేశారు.

సంజామల: గణేష్ ఉత్సవాలను ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్.ఐ రమణయ్య సూచించారు. మండల వ్యాప్తంగా ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా భక్తిశ్ర ద్ధలతో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలన్నారు.

అవుకు: మండలంలోని ప్రజలు వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంక టేశ్వరరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డితో కలసి గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు.

చాగలమర్రి: గ్రామాల్లో వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం సాయంత్రం సమస్యాత్మక గ్రామాలైన గొడిగనూరు, తోడెండ్లపల్లె, చిన్నవంగలి గ్రామాల్లో గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నబీసాహేబ్, పోలీసులు ఉన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ స్తంభాలతో పశువుల పాక



బీఎస్‌ఎన్‌ఎల్ స్తంభాలతో నిర్మించిన పశువుల పాక

బనగానపల్లె, సెప్టెంబరు 6: బనగానపల్లె మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురునాథరెడ్డి అనే వ్యక్తి బీఎస్‌ఎన్‌ఎల్ స్తంభాలను తీసుకెళ్లి పశువుల పాకను నిర్మించుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గతంలో బీఎస్‌ఎన్‌ఎల్ కంపెనీ అధికారులు ల్యాండ్‌లైన్ కనెక్షన్‌ల కోసం గ్రామంలోని వీధుల్లో స్తంభాలను ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్‌ల రాకతో ల్యాండ్‌లైన్ కనెక్షన్‌ల కథ ముగిసిపోయింది. అయితే బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు స్తంభాలను అలాగే ఉంచారు. గురునాథరెడ్డి వాటిని తీసుకెళ్లి ఏకంగా పశువుల పాకను నిర్మించుకున్నాడు. కాగా ఈ స్తంభాలను స్వాధీనం చేసుకుంటామని జేటీవో వెంకటేశ్వర్లు అన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6: ప్రస్తుత సీజన్‌లో డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని నివారించుకోవాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల వల్ల జ్వరాలు సోకే అవకాశం ఉందని, కాబట్టి అవగాహన పెంచుకోవాలని అన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 6: గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇటిక్యాల పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు డ్రైడే కార్యక్రమంలో భాగంగా తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించడంతోపాటు, నీటి పరీక్షలు నిర్వహించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించండి

సంజామల, సెప్టెంబరు 6: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సంజామల ప్రాంతీయ పశువైద్యాలయంలో పశువైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పశువులకు గాలి కుం టు వ్యాధి సోకిన వెంటనే టీకాలు వేయించాలన్నారు.

ముగిసిన భాగవత సప్తహ పారాయణం



పారాయణ కర్తలకు సన్మానిస్తున్న సంస్థాన్ కమిటీ సభ్యులు

డోన్(రూరల్), సెప్టెంబరు 6: పట్టణ సమీపంలోని రామచంద్ర మాలిక్ బాబా దేవస్థానంలో శుక్రవారం భాగవత సప్తహా పారాయణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. గత నెల 30వ తేదీ నుంచి వారం రోజులపాటు ఈ కార్యక్రమం జరిగింది. సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు ఆలా రామకృష్ణతోపాటు కమిటీ గౌరవాధ్యక్షుడు మర్రి కృష్ణమూర్తి తదితరులను సన్మానించారు.

వినాయక విగ్రహం ఏర్పాటుకు విరాళం



రూ.25 వేలు అందజేస్తున్న ఆలీహుసేన్

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6: వినాయక విగ్రహం ఏర్పాటుకు పట్టణంలోని ప్రముఖ న్యాయవాది ఆలీహుసేన్ రూ.25 వేలు విరాళం ఇచ్చారు. టీడీపీ యూత్ లీడరు, న్యాయవాది గాలే సాహెబ్‌గారి ఆలీహుసేన్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన సంజామల గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని న్యాయవాది భాస్కరరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆవుల హుసేన్‌రెడ్డి సేవా సమితిలో శుక్రవారం 400 విగ్రహాలను పంపిణీ చేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాగలమర్రి: వినాయక చవితి పండుగ సందర్భంగా గురువారం చాగలమర్రిలో అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శివరామానంద ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. దాత ప్రసాద్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు వల్లంకొండు దర్శన్ ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఉన్నారు.

ప్యాపిలి: మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని రాష్ట్ర ఎరుకల సంఘం సేవాసమితి అధ్యక్షురాలు మనోహరమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏకలవ్య సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఆమె పంపిణీ చేశారు.

'పంట నమోదు తప్పనిసరి'

రుద్రవరం, సెప్టెంబరు 6: పంట నమోదు తప్పనిసరి అని ఏవో శ్రీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 21,500 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారన్నారు. 18311 ఎకరాలను రైతులు పంట నమోదు చేయించుకున్నారన్నారు. ఇంకా 2500 నుంచి మూడు వేల ఎకరాలకు వరి సాగు రైతులు సాగు చేస్తునే ఉన్నారన్నారు. ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవడానికి ఈ నెల 15 చివరి తేది అని అన్నారు.

చెరువు గట్టుకు మరమ్మతులు



ఇసుక సంచులు ఏర్పాటు చేస్తున్న కూలీలు

రుద్రవరం, సెప్టెంబరు 6: మండలంలోని కొండమాయపల్లె చినరాజ చెరువుకు శుక్రవారం మరమ్మతులు చేయించినట్లు డీఈ గురుమూర్తి తెలిపారు. చెరువు గట్టు తూము వద్ద మరోసారి కృంగి ప్రమాదకరంగా ఉందేదన్నారు. అప్రమత్తపై ఇసుక సంచులు వేయించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చెరువులపై పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఏఈ మునాఫ్, డీఆర్వో మల్లేశప్ప, ఉప సర్పంచ్ బండారు బాలరాజు, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.